కథానిక

# రాగోదయం

పి. ప్రేమచంద్ర

ఉలిక్కిపడి లేచింది రాధ.

'అరె! ఇలా మొద్దునిద్దర పట్టేసిందేం చెప్మా!' అని అనుకుంటూ గబగబా దొడ్లోకి వెళ్ళి, సబ్బుతో మొహంతోముకు ఇంట్లోకి వచ్చింది టైము చూచేసరికి నాలుగుదాటింది. 'ఆయన వచ్చే వేళయిం'దనుకుంటూ కుంపటి రాజేసి కాఫీకి నీళ్ళుపడేసింది.

రాధకు మనస్సెందుకో ఉల్లాసంగా ఉంది. కూనిరాగంతీస్తూ ముఖానికి పౌడరద్దుకొని, బొట్టు తీర్చిదిద్ది పెట్టుకుంటూండగా, వీధి తలుపు చప్పుడైంది

శ్రీవారు కాస్త పెందరాళే వచ్చేసినట్టుంది, అనుకుంటూ తలుపు తీయబోయింది రాధ.

ఆ వచ్చింది గోపాలంకాదు—పేరంటాళ్ళు.

"రండి! రండి!!" అంటూ ఆ వచ్చిన మహిళలను ఆహ్వానించి కూర్చోమంది రాధ.

"అబ్బ! ఇప్పటికే చాల ఆలస్యమయిందండీ! ఇంకా వెళ్లవలసినఇళ్లు చాలఉన్నాయి" అంది ఒకావిడ

అసలు కథేవిఁటా అన్నట్టు చూస్తూ నిల్చుంది రాధ

ఇంతలో మరోఆవిడ "మా బావగారి చిన్న కూతురికి సీమంతం చేస్తున్నారు రేవు తప్పక రావాలి మీరు" అంటూ బొట్టుంచింది.

"అంటే మొన్న పెండ్లయిన లక్ష్మికే!" అంది రాధ ఆశ్చర్యంగా.

"అవునమ్మా! ఆ అమ్మాయికే!"అని వాళ్లు సెలవు తీసుకున్నారు.

అప్పటివరకు ఉల్లాసంగా, ఏమో తెలియని ఆనందంతో ఉరకలుతీసిన రాధ మనస్సు ఒక్కసారిగా వ్యాకులమయింది. అలాగేవచ్చి కుంపటిదగ్గర చతికిలబడింది. కుంపటిమీద నీళ్లు పొంగుతున్నా, రాధ అది గమనించే స్థితిలో లేదు. ఇంతలో గోపాలంవచ్చి శ్రీమతి స్థితిచూసి నవ్వుకుంటూ "ఏయ్! రాధా! ఏమిటలా కూర్చున్నావ్! నీళ్లు మరిగి పొయ్యిలో పడుతూంటేనూ.. " అని అన్నాడు.

రాధ తొట్రుపడుతూ, "అరె మీ రెప్పుడొచ్చారూ! చూడనేలేదు," అంటూ కాఫీపొడి వెయ్యటానికి లేచింది.

గోపాలం ముఖం కడుక్కొని న్యూస్ పేపర్‌తోసహా కుర్చీలో కూర్చున్నాడు ఇంతలో రాధ కాఫీతో అక్కడికి వచ్చింది

గోపాలం కాఫీ తీసుకుంటూ, "రాధా! ఏమిటలా ఉన్నావ్!" అన్నాడు లాలనగా

"అబ్బే! ఏంలేదండీ!"

"ఏమీలేదంటే మాత్రం నీముఖం చెప్పడం లేదనుకుంటున్నావా? ఏం జరిగింది" అని బుజ్జగిస్తూ అడిగాడు.

"మరేంలేదు ఆ నరసింహరావుగారి చిన్న కూతురికి సీమంతమట పిలవటానికి వచ్చారు," అని అక్కడే చతికిలపడి, భర్త మోకాళ్ళపై తల అనించి ఏదో చెప్పబోయింది. ఆ ఒక్క వాక్యం విన్న గోపాలానికి అసలు సంగతంతా బోధపడింది. ఇది మొదటిసారి కాదుగా! ఇలాంటివార్త ఏది విన్నా రాధ మనస్సు కష్టపడుతుంది. అలాంటి సమయాల్లో ఏదోవిధంగా రాధను సంతోషంగా ఉండేటట్లు చేయడం నేర్చుకున్నాడు గోపాలం.

"అన్నట్టు, రాధా! మినర్వాలో మంచి పిక్చర్ ఆడుతోంది వెళ్దాం రెడీ అవు" అన్నాడు

"ఇప్పుడేం పిక్చరు లెద్దురూ! వంట ఇంకా అవలేదు" అంది.

"ఈరోజు శనివారం గదూ! నా ఒక్కడికే గదా భోజనం! నేను కూడా ఇవాళ నీతోపాటు ఏదైనా టిఫిన్ తింటాలే వెళ్ళు! సిద్ధపడు" అనగానే, రాధ అక్కడినుండి కదిలింది

వెళ్తున్న రాధవైపు అలా చూస్తూ ఉండి పోయాడు గోపాలం

'పిచ్చి పిల్ల! శనివారాలు, సోమవారాలు ఏమిటేమిటో చేస్తుంది కాని ఏం లాభం! ఈ ఏడు సంవత్సరాలలోను రాధ కోరిక తీరనేలేదు ఈ రోజుల్లో పెండ్లయిన సంవత్సరానికల్లా అంతా బిడ్డనెత్తుకుంటూంటే, పిల్లలంటే ప్రాణమిచ్చే పిచ్చిరాధకు ఆ అదృష్టం రాలేదు' అంటూ ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"అదేవిఁటి? నన్ను సింగారించుకోమని మీరిలా కూర్చున్నారేం?" అంది రాధ. లేత నీలిరంగు వెంకటగిరి జరీచీర కట్టుకొని, తెల్లని క్రేప్ జాకెట్టు వేసుకు వచ్చిన రాధ, చూడ ముచ్చటగా ఉంది. ఆమె పచ్చని దేహకాంతి ఆ సంధ్యా సమయంలో మెరుస్తున్నట్లుగా కనబడింది గోపాలానికి

"రా....ధా" అంటూ దగ్గరకు తీసుకో బోయాడు.

"అబ్బ! ఉండండి ఇంకా చిన్న పిల్లాడిలా ఏవిఁటి" అంటూ తప్పుకోబోయిందిరాధ

"అయితే మనం ముసలాళ్ళమయి పోయామా అప్పుడే!" అన్నాడు నవ్వుతూ

"మీ సంగతేమోగాని, నేనుమాత్రం ముసలి దాన్నే. రెండు తక్కువగా ముప్పయి. ఒకటా, రెండా!" అంది రాధ నవ్వుతూ.

తాను విచారంగా ఉన్నట్టు కనబడితే భర్త నొచ్చుకుంటాడని, వీలైనంతవరకు సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తుంది రాధ.

ఇద్దరూ కలసి సినిమాకి బయలుదేరారు.

* * *

సినిమా అయిపోయింది. ఇద్దరూ మౌనంగా రిక్షాలో కూర్చున్నారు. రిక్షా సాగిపోతోంది. 'తేక తేక ఇలాంటి సినిమాకి తెచ్చానేమిటి? ఆ కాస్సేపయినా బాహ్య ప్రపంచాన్ని మరచి హాయిగా ఉందామంటే అక్కడా మన కథే!' అని అనుకుంటున్నాడు గోపాలం.

రాధకూడా సినిమా గురించే ఆలోచిస్తోంది. 'పాపం! ఆ కథానాయికకు బిడ్డలంటే ఎంతో మమకారం కాని పుట్టిన ప్రతీ బిడ్డా తనకు దక్కకుండా పోతాడు. అప్పుడు తన మరిదినే కన్నకొడుకుకన్నా ఎక్కువ ప్రేమతో పెంచి అతనికొరకే తన సర్వస్వాన్ని అర్పిస్తుంది తన సంగతి కూడా ఇంచుమించు అలానే ఉంది. తనకిక బిడ్డలు పుడ్తారనే ఆశ కూడా లేదు. తానుకూడా ఆమెలాగే ఎవరినైనా పెంచు కుంటేనో—'ఆ ఆలోచన రాగానే, భర్త మొఖం లోకి చూచింది. సరిగ్గా అప్పుడే గోపాలం రాధను మాటల్లో పెడ్దామని ఆమెవైపు చూస్తో, "రాధా! మీ డాక్టర్ ఫ్రెండ్ ఉత్తరాలు వ్రాస్తుందా?" అన్నాడు.

"ఆఁ! మొన్ననే వ్రాసిందండీ! నేను జవాబు వ్రాయాలి.' ఇలా ఏదో మాట్లాడుతూండగానే రిక్షా ఇల్లు చేరింది.

ఆ రాత్రి రాధకు ఎంతకూ నిద్దర పట్టలేదు. తనకు కలిగిన ఆ కొత్త ఆలోచనపై మరింకా ఆలోచనలు రాసాగాయి తమ బంధువర్గంలో పిల్లలుగలవాళ్లున్నారు వారిలో ఎవరిని దత్తత చేసుకుంటామన్నా సిద్ధంగా ఉన్నవాళ్లున్నారు. కాని ఆ పిల్లలు అంతా కాస్తోకూస్తో జ్ఞానం తెలిసినవాళ్ళే అలాంటివాళ్లను పెంచుకోవటం రాధకు ఇష్టంలేదు చంటిబిడ్డను తెచ్చుకొని, కన్నతల్లిలా ఆ బిడ్డ ఆలనా పాలనా చేయటంలో తనకు తృప్తి ఉంటుంది. ఇంతలో రాధకు మరొక ఆలోచన వచ్చింది. పడకమీదనుండి లేచి టేబిల్‌వద్దకు వెళ్ళి టేబుల్ లైట్ వేసి కుర్చీలో కూర్చుంది.

"మాలతికి యీ విషయం వ్రాస్తాను. డాక్టర్ కాబట్టి ఇలాంటి విషయం సహాయం చేయగల్గుతుందేమో!" అని అనుకుంటూ ఆ డాక్టర్ ఫ్రెండ్‌కు ఉత్తరం వ్రాసి ముగించింది. కాని ఇంకా నిద్ర రావటంలేదు అలానే కూర్చుని శూన్యంలోకి చూస్తూ ఉంది. ఇంతలో ఆమె దృష్టి అక్కడే ఉన్న తన ఆల్బమ్‌మీద పడింది. క్రిందటి రోజున ఫ్రెండ్స్ వస్తే తన ఆల్బమ్ తీసి వాళ్ల కిచ్చింది. అదింకా బల్ల

మీదే ఉంది 'కాస్సేపు ఆల్బమ్ చూద్దాం' అనుకుంటూ దాని పేజీలు తిరగవేయ సాగింది

మనం పాత డైరీలను తిరగవేస్తుంటే వెనకటి స్మృతులన్నీ ఒక్కసారి కళ్ళకు కట్టినట్లవుతాయి అలాగే ఈ ఆల్బమ్స్ కూడాను

రాధ పేజీలు తిప్పుతూ కూర్చుంది ఒక పేజీలో వాళ్లు ఇంటర్మీడియేట్ చదువుతుండగా ఆడపిల్లలంతా దగ్గర్లో ఉన్న ఒక గ్రామానికి పిక్నిక్‌కు వెళ్ళి తీసుకున్న ఫొటోలన్నీ అంటించి ఉన్నాయి అవి చూస్తుంటే రాధ పెదాలు చిన్నగా చిరునవ్వుతో విచ్చుకున్నాయి

పదిమంది గాబోలు వెళ్లారు ఆ రోజంతా ఎంతో సరదాగా గడిపారు తిరుగు ప్రయాణం రైలులో చేస్తే బావుంటుందని, బుట్టా తట్టాతో సహా స్టేషన్‌లోకి వచ్చారు. ఆ దృశ్యాలన్నీ తనకెంతో బాగా జ్ఞాపకమున్నాయి రైలువచ్చింది. అంతా కలసి ఒక పెట్టెలో ఎక్కి ఖాళీగా కూర్చున్నారు. రైలు నెమ్మదిగా నడుస్తుంది. ఇక, బాతాఖానీ మొదలుపెట్టారు తమలో అప్పటికి రమకి ఒక్కతెకే పెండ్లయింది అన్ని టాపిక్స్ అయినతర్వాత రమను 'టీజ్' చెయ్యడం మొదలుపెట్టారు అందరిలోను మాలతి చాలా గడుసుది

"ఏమోయ్! రమా! ఇంకా చదువేమిటి లెద్దూ! ప్రొడక్షన్ ప్రారంభించవా?" అంది మాలతి

"అబ్బ! పోదూ! చంపక!" అంది రమ గంపెడు సిగ్గుతో.

ఇక అక్కడితో పిల్లల మీదకు మళ్ళింది ప్రసంగం.

"అది సరేగాని, నీ కెంతమంది పిల్లలు కావాలో చెప్ప" అని అడిగింది రమణి

"నాకా! ఇద్దరు చాలు ఒక ఆడ, ఒక మొగ!" అంది రమ

"ఆఁ! నువ్వు—?" అని తనవైపు తిరిగింది మాలతి.

"నాకా-ఎవరైనా సరే, ఎంత మందైనా సరే-" ఇంకా ముగించలేదు తను

"ఇదో పిల్లలకోడి" అంది సీత అంతా నవ్వారు.

"అందరిని అడుగుతున్నావ్! నీ సంగతి చెప్పవే భామా!" అన్నదితను, మాలతితో.

"I dont believe in small number" అంది చిన్న మొత్తంలో ఆవిడకు నమ్మకం లేదట

తనకు పిల్లలంటే అసహ్యమని రకీమని చెప్పి ఊరుకుంది రమణి.

కాని యీ ఎనిమిది, పది సంవత్సరాలలోను ఎంత మార్పు!

పిల్లలంటే అసహ్యించుకునే రమణికి నలుగురు ఇప్పుడు దానికి పిల్లల తోడిదే లోకం! మాలతి డాక్టర్ అయింది పెండ్లి చేసుకోలేదు పిల్లలంటే అంత మోజుగల తనకు ఆ కోరిక కోరికగానే నిలచిపోయింది.

—ఆల్బమ్‌లోని మరో పేజీ తిప్పింది రాధ.

ఇది తనకు పెండ్లవక పూర్వం ప్రమీలతో తీయించుకుంది. అదంటే ఇప్పటికీ తనకు ప్రాణం. ఇప్పుడది సెకెండ్ ఫారం చదువుతుందనుకుంటా అప్పుడు దానికది రెండో సంవత్సరం

"పిన్నీ! ఆయి తీచికెల్లు ('ఆయి' అంటే దాని భాషలో షైర్ వెళ్ళటం అన్నమాట!) నన్ను ఎక్కు! ఊఁ!" అనేది ముద్దుగా దాని భాషకొరకు తను రోజూ రెండు మూడు ఫర్లాంగులు వెళ్ళేది.

ఒక రోజు అక్కయ్యతో అన్నది — "అక్కయ్యా! నీ కూతురు నా చేత చాలా చాకిరి చేయించుకుంటోందే! చూడు దాని చేత ఎంత చేయిస్తానో!"

"నా కూతురు అంత కృతఘ్నురాలేంగాదు నీవు అడక్కుండానే నీ పిల్లలను ఎత్తుకు తిప్పతుందిలే, నీవు కనడమే తరువాయి!" అని అనేది.

"కాని మనం అనుకున్నవన్నీ అక్షరాలా జరిగితే అది జీవితం అనిపించుకోదేమో!"— ఇలాగే ఏమేమో ఆలోచించుకుంటూ లైట్ అన్నా ఆర్పకుండా, అలాగే ఆ బల్లమీద మోచేతిని తలగడగా పెట్టుకు నిద్దరపోయింది రాధ.

ఆ రోజు ఆదివారం.

గోపాలం తీరుబడిగా కూర్చుని తనకు తానుగా ఛెస్ ఆడుకుంటున్నాడు

రాధ ఇంట్లో పని ముగించుకొని భర్త దగ్గరకు వచ్చి కూర్చుంది.

"రాధా! నీ కొరకే చూస్తున్నా ఒక్క ఆట ఆడదాం!" అన్నాడు

"ఇక, ఆటలొక్కటే తరువాయి అది సరే గాని, మాలతి ఉత్తరం వ్రాసిందండీ!"

"మాలతెవరు?" అన్నాడు, శకటుని జరుపుతూ.

"మీ కెప్పుడూ మతి మరుపే! మా డాక్టర్ ఫ్రెండ్ అ డీ!" అంది రాధ నవ్వుతూ

"ఓహో! ఆవిడా! ఏంవ్రాసింది?"

ఎలా మొదలు పెట్టడమా, తీరా విన్న తర్వాత ఏమంటాడో అని తటపటాయిచింది రాధ.

"అదేవిఁటి! చెప్పవేం?"అన్నాడుగోపాలం

"నేను మాలతికి వ్రాశానులెండి—నాకు ఎవరినైనా పెంచుకోవాలనుంది, చూడమని. దానికి జవాబు వ్రాసింది. వాళ్ల హాస్పిటల్‌లో ఒక ఐదునెలల అబ్బాయి ఉన్నాడట చాల చక్కగా ఉంటాడట తక్కిన సంగతులు మనం వెళ్ళి తెలుసుకోవాలి. మరి మీరు ఓ రెండురోజులు సెలవుపెట్టండి ఎంతత్వరగా వస్తే అంత మంచిదని వ్రాసింది" భర్త ఏమి జవాబిస్తాడోనని అతృతతో గోపాలం ముఖం లోకి చూచింది రాధ. కాని గోపాలం ఏమీ జవాబివ్వకుండా అలాగే మౌనంగా కూర్చు న్నాడు

"ఏమండీ! మాట్లాడరేం?" అంది రాధ

"ఇది ఆలోచించే చేస్తున్నావా రాధా! నిజంగా పెంచుకోవాలనుందా నీకు?" అన్నాడు

"అవునండీ! నిజంగా పెంచుకుంటాను. ఈ ఇంట్లో చంటిబిడ్డ తిరగాలి వాడి ఏడ్పు వినబడాలి నా కోరిక తీరేమార్గం ఇదొక్కటే. స్త్రీకి తల్లి నవ్వాలనే కోరిక ప్రచ్ఛన్నంగా ఉంటుం దని అంటారు గదా! కాని ఆ కోరిక నాకు బాహాటంగానే ఉండేది పెండ్లి అవక ముందు నుంచీ చిన్న పాపలంటే ఎంత సరదా వడే దాన్నో మీకూతెలుసుగా! కాని అంతటిఅదృష్టం భగవంతుడు నాకివ్వలేదు. ఏ తల్లో కన్న పాపణ్ణయినా తెచ్చుకుంటాను. నేనే వాడి కన్న తల్లినై, వాడి ఆలనా పాలనా చూసి తృప్తిపడ తాను కన్నప్రేమకంటే పెంచినప్రేమ గొప్ప దంటారు. నన్నిపాటి అదృష్టానికైనా నోచుకో నియ్యరా!" అంటూ ఉండగానే రాధ కళ్ళు చెమ్మగిల్లి, గొంతు జీరబోయింది

"ఛీ! పిచ్చిదానా! ఏదో మాటవరస కలా అన్నాను గాని, నీ వంతగా మనస్సు పడు తూంటే నేను వద్దంటానా? నీఇష్టమే నాఇష్టం. రేపే సెలవుకు అప్లైచేస్తాను. రేపు సాయంత్రం మెయిల్‌లో వెళ్దాం సరేనా!" అంటూ రాధ చెక్కిళ్లపై జారిన కన్నీళ్లను మృదువుగా తుడి చాడు గోపాలం.

అటువంటి ప్రేమమూర్తిని భర్తగా ఇచ్చి నందుకు ఆ క్షణాన రాధ భగవంతునికి కృత జ్ఞత చెప్పకోకుండా ఉండలేకపోయింది.

* * *

రాధని, గోపాలాన్ని ఎంతో ఆదరంతో ఆహ్వానించింది మాలతి. భోజనాలయింతర్వాత ముగ్గురూ కలసి హాస్పిటల్‌కు వెళ్ళారు బిడ్డ ఎలావుంటాడాఅన్న ఆతృత హెచ్చింది రాధకు వాళ్ళిద్దర్నీ విజిటర్సు రూమ్‌లో కూర్చోపెట్టి, మాలతి లోనికివెళ్ళి బేబీని తీసుకొచ్చింది

ఆ చిన్నపాపడు బోసినవ్వులు చిందిస్తు న్నాడు పచ్చని శరీరం నర్సుల పెంపకంవల్ల కాబోలు బంతిలా ఉన్నాడు అన్నింటికన్నా ఆ కళ్లు అంత చిన్నవయస్సులో కూడ ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి

మాలతి అబ్బాయిగురించి చెప్పసాగింది

"రాధా! ఈ పాపడు కడుపులోపడిన ఐదు నెలలకు తండ్రి అకస్మాత్తుగా ఒక ప్రమాదానికి గురిఅయి చనిపోయాడు పాపం! ఆవిడ ఆ బెంగతో చాల నీరసించి పోయింది వెనక దిక్కెవరూలేరు పురుడు చాల కష్టమయి ఆవిడ అప్పుడే పోయింది పుట్టినప్పుడు చాల పీలగా ఉన్నాడు కాని ఇప్పుడుచూడు, ఎలా దబ్బపండులా ఉన్నాడో! ఏదైనా శరణాల

యానికి అప్పగించాలని మా పెద్దడాక్టర్లు అనుకుంటూండగా, నీఉత్తరం అందింది. వాళ్ళతో నీ సంగతి చెప్పాను వాళ్లు సంతోషంగా వొప్పుకున్నారు మరి మీ ఉద్దేశమేమిటి?'' అంది మాలతి

రాధ భర్త ముఖం సంతృప్తిగా ఉండటం చూచి, బిడ్డను హృదయానికి అదుముకుంది.

* * *

ఇప్పుడు రాధ కోరినట్లుగానే ఇంట్లో చంటి బిడ్డ ఏడ్పులూ, జోలపాటలూ వినబడసాగాయి. పూర్వంలా రాధకు తోచకపోవడమంటూ లేదిప్పుడు ఎప్పుడూ ఏదోఒక పనిలోఉండేది ప్రొద్దుట లేచింది మొదలు, రాత్రి పడుకోబోయే వరకు రాధకు ఆ బిడ్డ సేవే! మారు మాట లేకుండా తన పనులు తాను చూచుకోవటం నేర్చుకున్నాడు గోపాలం

కాస్త ఎండెక్కగానే బాబిగాడికి రాధ స్వయంగా నీళ్ళు పోసేది వాడి పనులలో దాసీల చెయ్యి ఉండనిచ్చేదికాదు. మాలతి ఇచ్చిన సలహాల ప్రకారం వాడికి టైంప్రకారం పాలు పట్టేది రాధ ఏదన్నా కూనిరాగం తీస్తేనే గాని వాడు నిద్దరకొచ్చేవాడుకాదు ఏడో నెల రాగానే చక్కగా ఊసులాడటం మొదలుపెట్టే సరికి రాధ సంతోషం అంతా, ఇంతా కాదు దానికితోడు వాడు చక్కగా బొద్దుగా చూడ ముచ్చటగా తయారయ్యాడు, ఆ తల్లి చేతుల్లో!

మధ్యాహ్నం వాడు పడుకొన్న తర్వాత వాడికొరకు ఏ స్వెటర్సో, బొంతలో కుట్టూ కూర్చునేది సాయింత్రం గోపాలం ఆఫీసునుండి రాగానే బాబిగాడిని 'పెరాంబ్యులేటర్'లో పడుకోబెట్టి, అలా చల్లగాలిలో త్రిప్పి తీసుకొచ్చేవారా దంపతులు. తాను పెండ్లవక పూర్వం ప్రమీలను ఎత్తుకు షైర్ వెళ్ళటం జ్ఞాపకం వచ్చి, చిన్నగా నవ్వుకునేది రాధ ఇక రాత్రుళ్లు నాలుగుగంటల కొకసారి సరిగ్గా పాలకు లేచేవాడు వాడు లేవగానే పాలు కలిపి పట్టించేది. తెల్లవారుతుందనగా రాధకు కాస్త నిద్ర పట్టేది. కాని, అప్పుడా పెంకి వెధవలేచి దీపం చూస్తూ ఒకటే ఆట, ఒకటే కేరింతలు! దానితో రాధకు నిద్ర తేలిపోయేది. ఇలా రాత్రుళ్లు, పగలుకూడా రాధ ఎడతెరిపి లేకుండా వాడి సేవలోనే ఉండేది

ఇదంతా గమనిస్తున్న గోపాలానికి రాధ విషయమై భయం పట్టుకోసాగింది ఇలా రాధ మరీ రాత్రింబవళ్ళు కష్టపడుతూ మూలపడిందంటే, వాడినెవరు చూస్తారు? కాస్త చెప్పి చూద్దామనుకున్నాడు.

''రాధా!''

''ఆఁ! వస్తున్నా వీడు చూడండి, కాటుక పెట్టనీయటంలేదు'' అంటూ ఫిర్యాదు చేస్తూ బాబిగాడిని ఎత్తుకు, అక్కడికివచ్చి కూర్చుంది

''అయినా, మొగాడికి కాటికేమిటి?'' అన్నాడు గోపాలం నవ్వుతూ

''మీకేం తెలుసు! వాడి మొఖానికి కాటుక ఎంత అందంగా ఉందో చూడండి!'' అంటూ వాడిని చేతుల్లో పట్టుకు ఆయన ముందుంచింది

వాడు కాటుక చేతులతో రుద్దేసుకు, ముఖమంతా చేసుకున్నాడు. ఇద్దరూ నవ్వుకున్నారు, వాడి వైఖరి చూచి

''రాధా! వీడి కోసం ఒక ఆయాని మాట్లాడదామని చూస్తున్నాను'' నన్నాడు గోపాలం

''ఆయా ఎందుకు? అయినా ఆయాల చేతికిస్తానా, నా బిడ్డను?'' అంటూ, వాడి ముఖం ముద్దులతో నింపుతూ కూర్చుంది

''లేకపోతే ఎలా? రాత్రింబవళ్లు అలా కష్టపడి, నీకేదన్నా తెచ్చుకుంటావేమోనని నా భయం!'' అన్నాడు గోపాలం

''మరేఁభయంలేదు లెండి. తల్లిని గదా! ఆ మాత్రం బిడ్డ కొరకు కష్టపడవద్దా!''అంటూ నవ్వుతూ బిడ్డతో సహా లేచి లోనికి వెళ్ళిపోయింది

* * *

ఆ రోజు బాబిగాడి పుట్టిన రోజు. చాల అట్టహాసంగా అందర్నీ పిలచి పెద్ద పార్టీ చేశారు అప్పుడే వాడికి 'కిశోర్' అని నామకరణం కూడ చేశారు ఆ రోజంతా రాధ చాల హడావుడిగా ఉంది. ఆ రాత్రి వాడికి దిష్టి తగిలిందేమోనని కాసిని మిరపకాయలు దిగదుడిచి అవతల పారేసింది. అది చూచి

గోపాలం, 'రాధకు పెద్దల తరహా వచ్చేసింది,' అని నవ్వుకున్నాడు

* * *

ప్రతిరోజు ఆఫీసునుండి తాను వచ్చేసరికి రెడీగా బాబిగాడితో సహా ముస్తాబయి కూర్చునే రాధ, ఆ రోజు కనిపించకపోయేసరికి ఆశ్చర్యమేసింది గోపాలానికి "ఏంచెప్మా!" అనుకుంటూ లోనికి వెళ్ళేసరికి రాధ పడుకొనివుంది.

"ఏం రాధా! వంట్లో ఎలా ఉంది?" అన్నాడు గోపాలం.

"అబ్బే! ఏదో కాస్త తల తిరిగినట్టుగా ఉంటేనూ. అది సరేగాని వీడిని కాస్త అలా తిప్పి తీసుకురండి నన్ను నానాగొడవ చేస్తున్నాడు" అంది, కొడుకువైపు లాలనగా చూస్తూ.

ఆ రాత్రి రాధ భోజనం చెయ్యలేదు ఆ మర్నాడు లేచిందిగాని, మనిషి నలతగా కనిపించ సాగింది. గోపాలానికి మనస్సు వరివరి విధాల పోసాగింది. తరువాత రెండు రోజులు రాధ మామూలుగా తిరిగి పనిచేసుకో నారంభించేసరికి గోపాలానికి మనస్సు కుదుటపడింది.

కాని, మళ్ళా మూడో రోజు మంచమెక్కింది రాధ దానితో గోపాలానికి భయంవేసి డాక్టరు కోసం పరుగెత్తాడు.

లేడిడాక్టరు రాధను పరీక్షిస్తున్నంతసేపు గోపాలం కాలు గాలిన పిల్లిలా తిరగసాగాడు. బాబిగాడు అక్కడే కూర్చుని చక్కగా ఆడుకుంటున్నాడు. గోపాలానికి విపరీతమైన ఆలోచనలు వస్తున్నాయి.

తను అనుకున్నంతా అయింది. ఒకవేళ రాధ ఏమన్నా అయితే!—అమ్మో! ఇంకేమన్నా ఉందా! తాను బ్రతగ్గలడా! వీడిని వాళ్ళ అమ్మ చూస్తూన్నంత ప్రేమగా తాను చూడగలడా! ఈ ఆలోచనలు రాగానే మనిషి ఒక్కసారి ఒణికిపోయాడు. ఇంతలో తలుపు కిర్రుమంది.

"కంగ్రాట్యులేషన్స్! గోపాలం!" అంది లేడీడాక్టరు.

ఎందుకో, ఏమిటో, ఏమీ అర్థమవక తెల్ల ముఖం వేసి నిలబడ్డాడు గోపాలం

"మీరు ఒక ఆరు నెలల్లో తండ్రి కాబోతున్నారు" అంది డాక్టర్.

"ఆఁ! నిజంగా, కా....ని, మీరు సరిగ్గా పరీక్ష చేశారా? ఇన్ని సంవత్సరాలుగా లేంది-" అంటూ ఇంకా ఏమో చెప్పబోతుంటే, డాక్టరు నవ్వుతూ "ఇప్పుడు నమ్మవద్దులెండి. మరొక అబ్బాయో, అమ్మాయో వచ్చి 'నాన్నా! నేను వచ్చాను' అన్నప్పుడు నమ్ముదురుగాని" అని మళ్ళీ ఆవిడే ఇలా అంది. "దీనిలో వింతేమీ లేదండీ! ఆవిడ ఇంతకు ముందు తనకు పిల్లలు లేరనీ, ఇక తనకా అదృష్టం లేదనీ బెంగతో ఎప్పుడూ worry అవుతుండేవారు. ఆవిడకు మనశ్శాంతి ఉండకుండా పోవటంచేత అలా అయింది కాని, ఇప్పుడు మీరీ అబ్బాయిని పెంచుకోవటం చాలా మంచి పని చేసింది. ఆవిడకు ఈ అబ్బాయి వచ్చింతర్వాత తన కిక పిల్లలు పుట్టాలనే తృష్ణ తగ్గిపోయింది. వాడి పనుల్లో ఉక్కిరిబిక్కిరి అయి, మరో చింతా చీకూ లేకుండా సంతోషంగా ఉండటం చేత ఆవిడ గర్భం ఫలించింది. అంతే! మరి నే వస్తానండీ!" అంటూ ఆవిడ వెళ్ళిపోయింది.

గోపాలం ఆనందంతో ఒక్క ఉదుటున రాధ గదిలోకి వచ్చాడు. "రాధా! నిజమా?" అన్నాడు రాధను దగ్గరకు తీసుకుంటూ రాధకు సిగ్గుతో ముఖం ఎర్రబారింది

ఇంతలో బాబిగాడు అక్కడికి తప్పటడుగులు వేసుకుంటూ వచ్చాడు వాడిని గబుక్కున ఎత్తుకుంటూ, "ఇదంతా వీడి చలవ!" అంది రాధ, వాడి బుగ్గపై ముద్దు పెడుతూ. "వీడి చలవేమిటీ మధ్య" అన్నట్టు గోపాలం రాధ కళ్ళల్లోకి కొంటెగా చూచాడు. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. ఇద్దరూ ఒక్కసారి ఫక్కుమన్నారు. ఏమో తెలిసినట్లుగా బాబిగాడు కూడా వాళ్ళతోపాటు నవ్వేశాడు.

★

